

డిజిటల్ పద్ధతిలో సామాన్యుల ఖాతాల్లో
రూ.21వేల కోట్ల దోపిడీ

● బీజేపీ పాలకులపై సీఎం స్టాలిన్ ధ్వజం



సీఎం స్టాలిన్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లోని నల్లధనాన్ని తెచ్చి ప్రతి భారతీయుడి బ్యాంక్ ఖాతాల్లో తలా రూ.15 వేలు జమచేస్తామన్న బీజేపీ నాయకులు ప్రస్తుతం సామాన్యుల బ్యాంక్ ఖాతాల్లోని ధనాన్ని డిజిటల్ పద్ధతిన దోచుకునేలా చేస్తున్నారని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన తన ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేశారు. నల్ల ధనాన్ని, పేదరికాన్ని నిర్మూలిస్తామంటూ గొప్పలు చెప్పుకున్న కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రస్తుతం పేదల బ్యాంక్ ఖాతాల్లో మినిమం బ్యాలెన్స్ లేదన్న సాకుతో జరిమానాల పేరుతో దోపిడీలకు పాల్పడేలా చేస్తోందని ఆరోపించారు. ఈ పద్ధతిలో నిరుపేద ఖాతాదారుల నుంచి ఇప్పటి వరకూ రూ.21 వేల కోట్ల మేర బ్యాంకులు లాభం పొందేలా చేసి బీజేపీ పాలకులు పేదలకు తాము వ్యతిరేకులమని, శత్రువులమని రుజువుచేసుకున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. ఇక కార్పొరేట్ సంస్థలకైతే బీజేపీ పాలకులు ఎన్నో వరాలు, రాయితీలు ప్రకటించి ఆ సంస్థల పట్ల తమకున్న విశ్వాసాన్ని ఎలుగెత్తి చాటుకున్నారన్నారు. కార్పొరేట్ సంస్థల పారిశ్రామికవేత్తలకు భారీగా రుణాల మాఫీ ప్రకటించారని, అంతటితో ఆగకుండా కార్పొరేట్ పన్నులను 30 శాతం నుంచి 20 శాతానికి తగ్గించి వారంతా ఉన్నత స్థితికి చేరుకునేందుకు అన్ని విధాలా సహకరించారని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన రాయితీల వల్ల ఏర్పడిన నష్టాన్ని భర్తీ చేసేందుకు నిరుపేదల సొమ్మును బ్యాంక్ ఖాతాల్లో మినిమం బేలన్స్ లేదనే సాకుతో పెనాలిటీలుగా నిలువుదోపిడీ చేయడం భావ్యమేనా? అంటూ స్టాలిన్ బీజేపీ పాలకులను ప్రశ్నించారు.

కోవైలో ఒకే వేదికపై స్టాలిన్, రాహుల్...

ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఈ నెల 12న వాణిజ్య నగరం కోయంబత్తూరులో ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. ఆ నగరంలోని శెట్టియార్ పాళయం ఎల్ అండ్ టి బైపాస్ రోడ్డులో జరిగే ప్రచార సభలో పాల్గొనున్నారు. ఈ సభలో రాహుల్‌తోపాటు డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ కూడా పాల్గొననున్నారు. ఎన్డీయే తరఫున ప్రధాని మోదీ ఆరుసార్లు రాష్ట్రంలో పర్యటించినా కాంగ్రెస్ జాతీయ కమిటీ నాయకులెవరూ ఇప్పటిదాకా ప్రచారానికి రాలేదు. ఈ నేపథ్యంలో రాహుల్ ప్రచారం చేయడానికి రానుండటంతో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ఇతర నాయకులు కూడా ఉత్సాహంగా ప్రచార సభ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా కోయంబత్తూరు నగరమంతటా పోలీసులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

రూ.50వేలకు మించి ఉంటే
స్వాధీనమే



● ఈసీ సత్యప్రదసాహు

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎలాంటి రశీదులు, ఆధార పత్రాలు లేకుండా రూ.50వేల వరకు నగదు తీసుకెళ్ళవచ్చునని, అయితే ఈ గరిష్ఠపరిమితిని పెంచినట్లు రాష్ట్ర వ్యాప్తంగా పుకార్లు పుట్టిస్తున్నారని, వాటిని నమ్మవద్దని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహూ స్పష్టం చేశారు. సచివాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది తక్కువగా ఉండటం వల్లే తపాలా ఓట్ల సేకరణను దశలవారీగా చేపడుతున్నట్లు తెలిపారు. 85 యేళ్ల వయస్సున్న సీనియర్ సిటిజెన్లు ఈ నెల 18 వరకు తపాలా ఓట్లు వేయవచ్చునని చెప్పారు. ఈ ఎన్నికల్లో కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మార్క్ 3 రకం ఈవీఎంలను ఉపయోగిస్తున్నామని తెలిపారు. రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లకూడదనే ఆంక్షల వల్ల వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని, నగదు పరిమితిని రూ.2లక్షలకు పెంచాలని వ్యాపార సంఘాల సమాఖ్య నాయకులు విజ్ఞప్తి చేశారని, ఈ విషయమై కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామని, ఇప్పటి వరకూ నగదు పరిమితి పెంచుతూ ఎలాంటి ఉత్తర్వులు రాలేదని ఈ విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు.

బూత్ స్లిప్‌లు గుర్తింపు కార్డు కాదు...

ఎన్నికల సంఘం ఓటర్లకు అందజేస్తున్న ఫొటోలతో కూడిన బూత్ స్లిప్‌లు ఓటు వేయడానికి అవసరమైన గుర్తింపు కార్డు కాదని సత్యప్రద సాహూ స్పష్టం చేశారు. ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు సహా 13 రకాల ధ్రువీకరణ పత్రాలలో ఏదైనా ఒకటి చూపి ఓటు వేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.

8 వేల కేంద్రాలు సమస్యాత్మకం...

ఇదిలా ఉండగా లోక్‌సభ ఎన్నికల్లో 8050 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవని, 181 పోలింగ్ కేంద్రాలు మరింత సమస్యాత్మకమైనవని గుర్తించినట్లు ఆయన చెబుతూ ఆయా కేంద్రాల వద్ద అదనపు భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా 68వేలకు పైగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. షామియానాలు, తాగునీటి సదుపాయాలు కల్పించనున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు లక్షల మందికి పైగా ప్రభుత్వ సిబ్బంది, ఉపాధ్యాయులు ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బంధువు నివాసంలో
రూ.40 లక్షలు స్వాధీనం

● ఈపీఎస్ ప్రచారం చేసిన రెండో రోజునే...



నగదు పట్టుబడిన నివాసం

అడయార్, ఏప్రిల్ 4: తిరుపత్తూరులో అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే బంధువు ఇంటిలో రూ.40 లక్షలను ఆదాయపన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి ప్రచారం చేసిన వెళ్ళిన రెండు రోజుల్లోనే ఆ పార్టీ నేత నివాసంలో భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. మొత్తం ఐదుగురు సభ్యుల ఐటీ అధికారుల బృందం బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తిరుపత్తూరులోని నాదముని ముదలియార్ వీధిలో ఉన్న నవీన్ కుమార్ (35) నివాసానికి వచ్చి ఆకస్మికంగా తనిఖీలకు దిగారు. ముందుగా ఆ ఇంటిలోని ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, ఇంటిలోని వారిని బయటకు వెళ్ళనీయకుండా, బయటవారిని లోనికి రానివ్వకుండా పోలీసు భద్రత ఏర్పాటు చేసి అర్ధరాత్రి నుంచి ప్రారంభించిన ఈ తనిఖీలు వేకువజాము వరకు కొనసాగించారు. ఈ తనిఖీలో ఇంట్లో ఎలాంటి ఆధారాలు లేకుండా నిల్వ ఉంచిన రూ.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నవీన్ కుమార్ తిరుపత్తూరు బస్టాండులో ఒక ఫొటో స్టూడియో నడుపుతున్నారు. ఈయన తిరుపత్తూరు అన్నా డీఎంకే మాజీ ఎమ్మెల్యే కేజీ రమేష్‌కు బంధువు కావడం గమనార్హం. ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఈ మొత్తాన్ని నవీన్ కుమార్ నివాసంలో నిల్వవుంచి వుటారని అధికారులు భావిస్తున్నారు.

డీఎంకే జిల్లా కార్యదర్శి ఇల్లు, కార్యాలయాల్లో ఈడీ తనిఖీలు

పెరంబూర్, ఏప్రిల్ 4: తిరునల్వేలి తూర్పు జిల్లా కార్యదర్శి, మాజీ అసెంబ్లీ స్పీకర్ ఆవుడయప్పన్ ఇంట్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పాళయంకోట ఆయన కార్యాలయంలో కూడా అధికారులు తనిఖీలు చేశారు. అధికారులు తనిఖీలు చేపట్టారనే సమాచారంతో ఆవుడయప్పన్ ఇంటికి భారీస్థాయిలో కార్యకర్తలు చేరుకున్నారు. ఈడీ తనిఖీల సందర్భంగా ఎలాంటి ఉద్రిక్త వాతావరణం ఏర్పడకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం జరుగుతున్న సమయంలో అధికారపార్టీకి చెందిన సీనియర్ నేత ఇంట్లో అధికారులు తనిఖీలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, తిరుపత్తూర్‌లో అన్నాడీఎంకేకు చెందిన మాజీ ఎమ్మెల్యే బంధువుల ఇంట్లో ఐటీ అధికారులు బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం వేకువజాము వరకు తనిఖీ చేసి రూ.40 లక్షలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

రాష్ట్రంలో పోస్టల్ ఓట్ల పోలింగ్ ప్రారంభం



అడయార్, ఏప్రిల్ 4: ఈ నెల 19న రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. ఈ గడువు సమీపిస్తుండటంతో ఎన్నికల అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పోస్టల్ ఓట్ల పోలింగ్ ప్రారంభమైంది. 85 యేళ్ళు పైబడిన వారితో పాటు దివ్యాంగులకు పోస్టల్ ఓటింగ్ ఉపయోగించుకునే వెసులుబాటుంది. దీంతో అనేక మంది వృద్ధులు, దివ్యాంగులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకుంటున్నారు. గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రంలో 85 యేళ్ళు పైబడిన వారు 608952 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 430734 మంది పోస్టల్ ఓట్లను వినియోగించుకునేందుకు 12డి ఫాం ఎన్నికల అధికారులు ఇచ్చారు. కానీ లక్ష మంది మాత్రమే ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకునేందుకు ముందుకు వచ్చారు. అలాగే, రాష్ట్రంలో 461909 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారు. వీరిలో 365875 మంది పోస్టల్‌లో ఓటు వేసేందుకు అనుమతి కోరారు. కానీ, 52 వేల మంది మాత్రమే వినతిపత్రాలు సమర్పించారు. దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఈరోడ్ జిల్లాలో 3054 మంది దరఖాస్తు చేసుకోగా, 3001 మంది పోస్టల్ ఓటు వేసేందుకు అర్హత సాధించారు. చెన్నై నగరంలో 3901167 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 11369 మంది వికలాంగులు, 85 యేళ్ళు పైబడిన వారు 63751 మందితో కలుపుకుని మొత్తం 75120 మంది ఓటర్లు పోస్టల్ ఓటుకు అర్హత సాధించారు. ఇదే విధంగా ఆయా జిల్లాల్లోనూ పోస్టల్ ఓట్ల కోసం దరఖాస్తు చేసుకుని అర్హత సాధించిన వారికి పోస్టల్ ఓటింగ్ ప్రారంభమైంది. వీరందరి ఓట్లను బీఎల్వో (బూత్ లెవల్ ఆఫీసర్లు)ల ద్వారా ఓటింగ్ నిర్వహిస్తున్నారు.

19న ప్రభుత్వ సెలవు

పెరంబూర్, ఏప్రిల్ 4: రాష్ట్రంలో ఈ నెల 19వ తేది సెలవు రోజుగా ప్రభుత్వం ప్రకటించింది. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 లోక్‌సభ స్థానాలకు తొలివిడతలో ఈ నెల 19న ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఎన్నికలను పురస్కరించుకొని కర్మాగారాలు, వాణిజ్య సంస్థలు తమ సిబ్బంది ఓటు హక్కు వినియోగించేలా వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలని కార్మిక సంక్షేమ శాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, ఎన్నికలు జరుగుతున్న 19వ తేది ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.. కాగా, పుదుచ్చేరిలో కూడా 19వ తేది ఆ రాష్ట్రప్రభుత్వం సెలవు ప్రకటించింది.

డీఎంకే ఓ అవినీతి పార్టీ

2జీ కేసులో మళ్ళీ రాజా జైలుకే ● ఊటీ ప్రచారంలో ఈపీఎస్



భారీ జనసందోహం మధ్య ఈపీఎస్ అభివాదం

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అవినీతి అక్రమాలకు చక్కటి ఉదాహరణ డీఎంకే పార్టీ అని, త్వరలో 2జీ కేసులో ఆ పార్టీ ఎంపీ రాజా జైలుకెళ్లడం ఖాయమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. నీలగిరిలో పోటీ చేస్తున్న లోకేష్ తమిళ్‌సెల్వన్‌కు మద్దతుగా ఊటీలో ఆయన ప్రచారం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి జయలలితకు బాగా నచ్చిన ప్రాంతం నీలగిరి జిల్లా అని, ఆమె తరచూ ఊటీ వచ్చి వెళుతుండేవారని గుర్తు చేసుకున్నారు. నీలగిరి జిల్లాలో ఎక్కువసార్లు పర్యటించిన ఏకైక ముఖ్యమంత్రి జయలలితేనని చెప్పారు. ఈ నియోజకవర్గంలో డీఎంకే తరఫున పోటీ చేస్తున్న ఎ.రాజా అహంకారి, హిందూ మత వ్యతిరేకి అని విమర్శించారు. గత మూడేళ్లుగా డీఎంకే ప్రభుత్వం ప్రజలకు మద్యం విక్రయించి, మాదక ద్రవ్యాలను, పొగాకు వస్తువులను విక్రయించి మత్తులో జోగేలా చేసిందన్నారు. సిట్టింగ్ ఎంపీ రాజా ఈ నియోజకవర్గం అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఊటీలోని దుకాణాల అద్దెలను డీఎంకే ప్రభుత్వం విపరీతంగా పెంచి పర్యాటకులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయేలా చేసిందన్నారు.

పౌరసత్వాన్ని కాపాడుకునే
సమయమిది!

చిదంబరం రోడ్‌షోలో కమల్‌హాసన్



చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భారతీయులంతా తమ పౌరసత్వాన్ని కాపాడుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని, ఆ పౌరసత్వం పదికాలాలపాటు చెక్కుచెదరకుండా ఉండాలంటే ఎన్డీయేని ఓడించాలని మక్కల్ నీదిమయ్యం నాయకుడు కమల్‌హాసన్ పిలుపునిచ్చారు. చిదంబరంలో పోటీ చేసున్న డీపీఐ నాయకుడు తొల్ తిరుమావళవన్‌కు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల దేశం అన్ని రంగాల్లో భ్రష్టుపట్టిపోయిందని, ప్రజలు పౌరసత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడనుందని, రాజ్యాంగ ధర్మాసనం మాయమై దేశంలో రాచరికం అమలులోకి వచ్చే అవకాశం కూడా ఉందని, ఈ పరిస్థితులలో ఓటర్లు బాగా ఆలోచించి ఇండియా కూటమి అభ్యర్థులను ఓటేసి గెలిపించాలని కోరారు. భారతీయులలో ఒకడిగా, తమిళుడిగా తాను ఇండియా కూటమికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఎలాంటి స్వార్థం లేదని చెప్పారు. చిదంబరంలో ప్రచారం చేయడానికి హెలికాప్టర్‌లో పుదుచ్చేరి చేరుకున్న కమల్‌హాసన్‌కు డీఎంకే, మిత్రపక్షాల కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పుదుచ్చేరి నుంచి ఆయన కారులో చిదంబరం ప్రాంతానికి వెళ్ళారు.

రంజాన్ వేళలు

శుక్రవారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.28
శనివారం : సహర్ : ఉదయం - 4.21



పాండీబజార్‌లో 2 కి.మీ.ల వరకూ
మోదీ రోడ్‌షో

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆ నెల తొమ్మిదిన వేలూరు విచ్చేస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆ నగరంలో ఏర్పాటు చేసే బ్రహ్మాండమైన రోడ్‌షోలో మోదీ పాల్గొని ఎన్డీయే కూటమి తరఫున పోటీచేస్తున్న న్యూ జస్టిస్ పార్టీ నేత ఏసీ షణ్ముగం, పీఎంకే అభ్యర్థి సౌమ్యా అన్బుమణి, కడలూరు పీఎంకే అభ్యర్థి తంగర్‌బచ్చన్ కోసం ప్రచారంచేయనున్నారు. ఆ తర్వాత వేలూరు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి చెన్నై విమానాశ్రయం చేరుకుని కారులో నందనం మీదుగా టి. నగర్ పానగల్ పార్కు ప్రాంతానికి విచ్చేస్తారు. అక్కడి నుండి పాండీబజార్ మీదుగా తేనాంపేట సిగ్నల్ దాకా రోడ్‌షోలో పాల్గొని చెన్నై నగర పరిధిలో పోటీ చేస్తున్న ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు ఐదంచెల భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

కాబోయే ప్రధాని
మనోడే...!

● కరూర్ ప్రచార సభలో మంత్రి ఉదయనిధి



కరూర్ కాంగ్రెస్ అభ్యర్థి జ్యోతిమణికి మద్దతుగా ప్రచారంలో మంత్రి ఉదయనిధి

ప్యారీస్, ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తే ప్రధానిగా డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సూచించిన వ్యక్తి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తారని మంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. డీఎంకే కూటమి తరఫున కరూర్ లోక్‌సభ నియోజకవర్గంలో పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి జ్యోతిమణికి మద్దతుగా రాష్ట్ర మంత్రి ఉదయనిధి గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు ఉన్నత విద్య చదువుకోవాలనే దృక్పథంతో డీఎంకే ప్రభుత్వం పరిచయం చేసిన 'పుదుమై పెన్' పథకానికి ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న మహిళలకు విద్యా ప్రోత్సాహక నిధిగా ప్రతినెలా రూ.1,000 పంపిణీ చేస్తున్నామని, అందువల్ల రెండేళ్లలో 3 లక్షల మందికి పైగా విద్యార్థినులు లబ్ధిపొందారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలన్న దృష్టితో ప్రవేశపెట్టిన అల్పాహార పథకానికి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రారంభమైన ఈ పథకాన్ని ఇటీవల ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా పరిచయం చేశారని, అంతేకాకుండా కెనడా ప్రధాని జస్టిన్ రూథర్ కూడా ఆ దేశంలో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. డీఎంకే ప్రభుత్వం సాధించిన విజయాలను ఈ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థిస్తున్నామని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ అభ్యర్థులు, కూటమి పార్టీల అభ్యర్థులకు మద్దతుగా పాల్గొనే ప్రచార సభల్లో విపక్షాల గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలపై చిన్నచూపు చూస్తున్నారని, ప్రస్తుతం ఎన్నికలు రావడంతో ఓట్ల కోసం మళ్లీ రాష్ట్రంలో పర్యటిస్తున్నారని, ప్రధాని హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మాజీ మంత్రి సెంథిల్ బాలాజీని బెదిరించి ఆయనపై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపించారని, ఆయన త్వరలోనే బయటకు వస్తారని, ఇందుకోసం ముఖ్యమంత్రి స్టాలిన్ న్యాయపోరాటం చేస్తున్నారన్నారు.

సమాచార దర్శిని

మద్రాసు వర్సిటీ తెలుగుశాఖలో నేడు ఉగాది వేడుకలు

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'శ్రీక్రోధి' నామ ఉగాది వేడుకలు జరుగనున్నాయి. మెరీనా క్యాంపస్ రజోత్సవ ప్రాంగణంలో జరిగే ఈ వేడుకల్లో పెరంబూరు తెలుగు సాహితీ సమితి కార్యదర్శి డాక్టర్ టీఆర్ఎస్ శర్మ పంచాంగ పఠనం చేస్తారు. సినీ గేయరచయిత భువనచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొంటారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు కమలాకర రాజేశ్వరి ఉగాది ఉపన్యాసమిస్తారు. ఆ తర్వాత నాలుగు పుస్తకాల ఆవిష్కరణ, డాక్టర్ బూసి వెంకటస్వామికి తెలుగుశాఖ ఉగాది పురస్కారం ప్రదానం చేస్తారు. భోజన విరామం తర్వాత తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన ఉగాది కవి సమ్మేళనం జరుగుతుంది. అరవై మంది ఉగాది కవితలను వినిపించనున్నారు. సాయంత్రం ఎంఆర్ సుబ్రహ్మణ్యం సారథ్యంలో ఆనందలహరి పేరుతో సంగీత కార్యక్రమం నిర్వహించనున్నారు.

కామన్ మీటర్ డేటా మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు

ఐసిఎఫ్, ఏప్రిల్ 4: రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్ల మీటర్లలో నమోదయ్యే విద్యుత్ వినియోగాన్ని చెన్నైలో సేకరించేందుకు కామన్ మీటర్ డేటా మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను విద్యుత్ బోర్డు ఏర్పాటుచేసింది. విద్యుత్ బోర్డు పరిధిలో 3.31 కోట్ల విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఇందులో 21 లక్షల వ్యవసాయ, 9.45 లక్షల గుడిసెలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ మీటర్లలో నమోదయ్యే వినియోగం వివరాలను ఉద్యోగులు రెండు నెలలకు ఒకసారి లెక్కిస్తున్నారు. ఇందులో అవకతవకలు జరగడంతో స్మార్ట్ మీటర్ పథకం అమలుపరచనున్నారు. ఒప్పంద సంస్థను ఎంపిక చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్ మీటర్ల వివరాలు, ఓల్టేజి పరిమాణాలను చెన్నై ప్రధాన కార్యాలయం నుంచి లెక్కించేందుకు కామన్ మీటర్ డేటా మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రిన్సిపాల్ లేని బీఎడ్ కళాశాలల గణన

ఐసిఎఫ్, ఏప్రిల్ 4: ప్రిన్సిపాళ్లు లేని బీఎడ్ కళాశాలల వివరాలు సేకరించాలని అధికారులకు ఉపాధ్యాయ విద్య విశ్వవిద్యాలయం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర ఉపాధ్యాయ విద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 21 ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు సహా 600లకు పైగా బీఎడ్ కళాశాలలున్నాయి. వీటిలో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేసిన వారు ప్రిన్సిపాల్‌గా ఉండాలి, పలు కళాశాలల్లో ఈ విద్యార్హత లేని వారిని ప్రిన్సిపాల్‌గా నియమిస్తున్నారు. కొన్ని చోట్ల ఇదివరకే ఒక కళాశాలలో ప్రిన్సిపాల్‌గా ఉన్న వ్యక్తిని మరో కళాశాలకు ప్రిన్సిపాల్‌గా చూపిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా ఒకదాని కన్నా ఎక్కువ కళాశాలల్లో ప్రిన్సిపాల్‌గా ఉన్న వారు అనర్హులని గుర్తించి ఆ వివరాలు తెలియజేయాలని అధికారులకు వర్సిటీ ఉత్తర్వులు జారీచేసింది.

19,413 మెగావాట్లకు చేరిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, ఏప్రిల్ 4: రాష్ట్రంలో విద్యుత్ వినియోగం ఇదివరకు ఎన్నడూ లేనంతగా బుధవారం 19,413 మెగావాట్లుగా నమోదైందని టాన్‌జెడ్కో తెలిపింది. బుధవారం మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు అత్యధిక విద్యుత్ వినియోగం జరిగింది. రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం గత మార్చి 22వ తేది 19,400 మెగావాట్లుగా నమోదైందని అధికారులు తెలిపారు.

తమిళనాడుకు కావేరి జలాలు ఇవ్వలేం...

● స్పష్టం చేసిన కర్ణాటక ప్రభుత్వం

పెరంబూర్, ఏప్రిల్ 4: తమిళనాడుకు నీరు ఇవ్వలేమని కర్ణాటక ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం కావేరి నిర్వహణ మండలి 29వ సమావేశం మండలి అధ్యక్షుడు ఎస్కే. హల్దర్ నేతృత్వంలో జరుగగా తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి బకాయి ఉన్న 3.5 టీఎంసీలు, ఏప్రిల్, మే నెలలకు అందించాల్సిన నీటిని విడుదల చేసేలా కర్ణాటక ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వాలని రాష్ట్ర అధికారులు డిమాండ్ చేశారు. ఈ విషయమై కర్ణాటక అధికారులు బదులిస్తూ, ప్రస్తుతం తమ రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, బెంగుళూరు నగరంలో కూడా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల తమిళనాడు కోరిన జలాలు ఇవ్వలేమని స్పష్టం చేశారు.

24 మంది రామేశ్వరం జాలర్ల విడుదల

పెరంబూర్, ఏప్రిల్ 4: రామేశ్వరానికి చెందిన 24 మంది జాలర్లను విడుదల చేసిన శ్రీలంక న్యాయస్థానం, ఒక జాలరికి మాత్రం 6 నెలల జైలుశిక్ష విధించింది. సరిహద్దు దాటారంటూ గత నెల 21వ తేది రామేశ్వరం నుంచి వెళ్లిన 25 మంది జాలర్లను అరెస్ట్ చేసిన శ్రీలంక నావికాదళం. వారు వెళ్లిన మూడు ఫైబర్ పడవలను స్వాధీనం చేసుకున్నారు. జాలర్లను కోర్టులో హాజరుపరచగా గురువారం వరకు రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో, గురువారం జాలర్లను కోర్టులో హాజరుపరచగా, 24 మంది జాలర్లను విడుదల చేసిన న్యాయస్థానం, ఒక జాలరికి మాత్రం 6 నెలల జైలుశిక్ష విధించింది. విడుదల చేసిన జాలర్లను జాఫ్నాలోని భారత దౌత్య కార్యాలయానికి అప్పగించారు. కాగా, ఇదివరకు కోర్టు ఉత్తర్వులతో విడుదలైన 19 మంది జాలర్లు గురువారం నగరానికి చేరుకున్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

ఎన్నికల ఉద్యోగులకు ఓఆర్ఎస్

ఐసిఎఫ్, ఏప్రిల్ 4: ఎన్నికల ఉద్యోగులకు ప్రతిరోజు ఓఆర్ఎస్ పానీయం అందజేయనున్నట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఈ నెల 19వ తేది జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు 68,324 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎండ నుంచి ఉపశమనం కలిగేలా ఓటర్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్నికల ఉద్యోగులకు ఓఆర్ఎస్ ద్రావకం అందించనున్నామని అధికారులు తెలిపారు.

ఆధ్యాత్మిక 'పరిమళం' రంజాన్

● సుర్మా, అత్తర్ల అమ్మకాలకు ప్రత్యేకత చెన్నై



కొనుగోలుదారులకు అత్తరు చూపుతున్న సేల్స్‌మెన్

ప్యారీస్, ఏప్రిల్ 4: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో 'సుర్మా', 'అత్తర్లు' అద్యంతం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూ ప్రత్యేకత చాటుతున్నాయి. ఈ మాసంలో ముస్లింలు వయోభేదం లేకుండా త్రికరణశుద్ధితో ఉపవాసం (రోజా) పాటిస్తూ నెల రోజులు ఖురాన్ పఠిస్తూ ఐదుపూటలా నమాజ్ చేస్తుంటారు. ఈ క్రమంలో ఎంతో విశిష్టమైన రంజాన్ మాసంలో ముస్లింలు తమ నేత్రాలకు వేసుకునే సుర్మాకు ఎంతో విశిష్టత ఉంది. విధిగా కళ్లకు సుర్మా అలంకరించడం పవిత్ర కార్యంగా భావిస్తారు. సువాసన వెదజల్లే అత్తర్లకు ప్రాధాన్యమిస్తారు.



ఇదీ...సుర్మా విశిష్టత...

నిత్యం అల్లాహ్ నామస్మరణలో గడిపే దైవప్రవక్త హజ్రత్ మూసా అలైహిసాలాతుస్సలాంకు అల్లా ప్రసన్నం పొంది అతడిని అల్లా ఎక్కడున్నాడో చూపించమని అనునీయులు కోరుతారు. దీంతో సిరియా, ఈజిప్టు ప్రాంతాలకు చెందిన పెద్దలను సమీపంలోని కోహినూర్ పర్వతం వద్దకు తీసుకెళ్తారు. అక్కడ ఒక్కసారి అల్లాహ్ నూర్ ప్రత్యక్షం కావడం చూసి ఆశ్చర్యానికి గురవుతారు. అప్పుడే అల్లాహ్ మహిమతో కోహినూర్ పర్వతం భస్మమై బూడిద (చూర్ణం)గా మారుతుంది. దైవసంకల్పం కళ్లెదుట సాక్షాత్కరించడంతో తమలోని భక్తి ఉప్పొంగి ఆ చూర్ణాన్ని వారు కళ్లకు అద్దుకుంటారు.



మేలు రకం అత్తరు

అప్పటి నుంచి కోహినూర్ పర్వతానికి చెందిన రాళ్ల చూర్ణమే క్రమంగా సూర్మాగా రూపాంతరం చెందిందని ముస్లింల ప్రగాఢ నమ్మకం.



సుర్మా

కళ్లకెంతో మేలు...

భక్తితో పాటు వైద్య పరిభాషలోను ఈ సూర్మాకు ఆరోగ్యప్రదాయనిగా పేరుంది. కంటికి సంబంధించిన వ్యాధులకు నివారణగా, కళ్లకు వేసవి కాలంలో చలువగా సుర్మా పనిచేస్తుంది. ఇక పవిత్ర రంజాన్ మాసంలో సుర్మా, అత్తర్లు పూయడం ద్వారా గౌరవించే సంప్రదాయాన్ని ముస్లింలు కొనసాగిస్తున్నారు.

సుర్మా, అత్తర్ల విక్రయాలు...!

రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు అధిక సంఖ్యలో నివసిస్తున్న ప్రాంతాల్లో రంజాన్ సందర్భంగా అత్తర్లు, సుర్మా విక్రయాలకు మంచి గిరాకీ ఉంటుంది. దీని కోసం అన్ని జిల్లాల్లో దుకాణాలు వెలిశాయి. సుర్మా కిలో పొడి ధర రూ.180 నుంచి రూ.600 వరకు ఉంటుంది. వీటిని చిన్న సీసాల్లో నింపి రూ.10 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు.



ఈతర్ సువాసనలు...

రాజధాని నగరం ప్యారీస్ సమీపంలోని హార్బర్ నియోజకవర్గం సెకండ్ లైన్ బీచ్‌గా ప్రసిద్ధిచెందిన మూర్ స్ట్రీట్, అంగప్పనాయకన్ వీధి, లింగిచెట్టి వీధి, ట్రిప్లికేన్ నియోజకవర్గ పరిధిలోని జాం బజార్, ఆదాం మార్కెట్, రాయపేట, ఐస్ హౌస్, సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని పెరియమెట్టు, పులియాన్‌తోపు, రాయపురం, థౌజండ్ లైట్స్, అడయారు తదితర ప్రాంతాలకు వెళ్తే చాలు... సువాసనలు గుప్పుమంటాయి. బట్టలపై ఒక చుక్క ఈతర్‌ను రాసుకుంటే చాలు... ఆ రోజే కాదు, మరో రెండు రోజులు కూడా సువాసనలు వెదజల్లుతూనే ఉంటుంది. పరిమళాలను వెదజల్లే ఈతర్‌కు వాడుక భాషలో అత్తర్‌గా వ్యవహరిస్తారు. రంజాన్ మాసంలో ముస్లింలు అత్తర్‌ను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఒకప్పుడు ధనిక వర్గాలు మాత్రమే వాడే అత్తర్లను ప్రస్తుతం అన్ని వర్గాల వారు వాడుతున్నారు. ఇందువల్ల నగరంలో అత్తర్లు, సుర్మా అమ్మకాలు ఊపందుకున్నాయి.



నాణ్యతను బట్టి ధర...

ఈతర్‌లో అనేక రకాలున్నాయి. జన్నతుల్ ఫిర్‌డౌస్, పహాడిపూల్, హరాగులాబ్, అరుస, నౌషాద్, సమామాతుల్, అంబర్, హి, జఫ్రాన్, మష్, దహనుల్ ఈద్, కచ్చికలి, మోగ్రా ముఖ్యమైనవి. నిలువ ఉంచే కాలాన్ని బట్టి అత్తర్ల ధర నిర్ణయిస్తారు. సువాసన, నాణ్యతను బట్టి చిన్నపాటి సీసాకు రూ.30 నుంచి ధర మొదలవుతుంది. ఇక నాణ్యమైన రకాలు రూ.200 నుంచి రూ.20 వేలకు పైగా ఉంటాయి.

దక్షిణ రైల్వే చీఫ్ పీఆర్వోగా సెంథమిళ్ సెల్వన్



అడయార్, ఏప్రిల్ 4: దక్షిణ రైల్వే ప్రజా సంబంధాల ముఖ్యాధికారి(చీఫ్ పీఆర్వో)గా ఎం.సెంథమిళ్ సెల్వన్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆ విధులు నిర్వహించిన బి.గుహనేశన్ దక్షిణ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజరుగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సెంథమిళ్ సెల్వన్‌ను నియమించారు. ఆయన గతంలో జనరల్ మేనేజర్‌కు సెక్రటరీగా, కోఆర్డినేషన్ విభాగంలో డిప్యూటీ జనరల్ మేనేజరుగా పనిచేశారు. కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఐ)లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పట్టాను స్వీకరించారు. ఆ తర్వాత అన్నా విశ్వవిద్యాలయంలోని గిండీ ఇంజనీరింగ్ కాలేజీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. యూపీఎస్సీ ప్రవేశ పరీక్ష ద్వారా భారతీయ రైల్వే ఉద్యోగంలో చేరిన ఆయన.. దక్షిణ రైల్వేలో వివిధ పోస్టుల్లో పనిచేశారు. అరక్కోణంలో సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, రాయపురంలోని ఎలక్ట్రికల్ లోకోమోటివ్ షెడ్‌లలో పనిచేశారు. అలాగే, జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జేఐసీఏ) ఆధ్వర్యంలో జపాన్‌లో జరిగిన హైస్పీడ్ రైల్ ట్రైనింగ్‌లో శిక్షణ పొందారు. ప్రస్తుతం చీఫ్ పీఆర్వోగా నియమితులు కాకముందు చెన్నై డివిజన్, ఆపరేషన్స్ విభాగంలో సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించారు.

డాక్టర్ కాసలకు ఉగాది విశిష్ట పురస్కారం



డాక్టర్ కాసల నాగభూషణం

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రచయిత డాక్టర్ కాసల నాగభూషణంను శ్రీక్రోధి నామ ఉగాది విశిష్ట పురస్కారం వరించింది. తిరుపతికి చెందిన 'విద్యా పరిరక్షణ సమితి' ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఈ నెల 7వ తేదీ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేయనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆచార్య ఉష అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య పి.విజయలక్ష్మి హాజరు కానున్నారు. అదే విధంగా విశిష్ట అతిథిగా శ్రీకాళహస్తికి చెందిన 'ధూర్జటి రసజ్ఞ సమాఖ్య' కార్యదర్శి తీగల వెంకటయ్య, ఆత్మీయ అతిథిగా ద్రావిడ విశ్వవిద్యాలయం విశ్రాంత డీన్ ఆచార్య బి.కృష్ణారెడ్డి పాల్గొననున్నారు. డాక్టర్ కాసలతో పాటు పలువురికి ఉగాది విశిష్ట పురస్కారాలు అందజేయనున్నారు.

31వ సారి సెంథిల్ బాలాజి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 4: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను 31వ సారి న్యాయస్థానం పొడిగించింది. చట్టవ్యతిరేక నగదు బట్వాడా నిరోధక చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు అరెస్ట్ చేసిన సెంథిల్ బాలాజీ పుళల్ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. ఆయన రిమాండ్ గడువు గురువారం ముగియడంతో ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను ఈ నెల 15వ తేది వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

చోరీకి గురైన నగలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు, నగదు

వేలూరు, ఏప్రిల్ 4: చోరీకి గురైన బంగారు, వెండి, నగదును ప్రత్యేక బృందం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాణిపేట జిల్లా రత్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 75 సవర్ల నగలు, కిలో వెండి, రూ.2 లక్షలు, ఒక ల్యాప్‌టాప్ చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై డీఐజీ ఆదేశాలతో ఎస్పీ కిరణ్ స్నృతి ప్రత్యేక బృందం ఏర్పాటుచేశారు. ఆర్కాడు ఇన్‌స్పెక్టర్ శశికుమార్ నేతృత్వంలోని బృందం విచారణ చేపట్టి అయ్యప్పన్, కన్నదాసన్‌లను అరెస్ట్ చేసి, వారి నుంచి 56 సవర్ల నగలు, కిలో వెండి, రూ.95 వేలు నగదు, లాప్ ట్యాప్ స్వాధీనం చేసుకున్నారు.

శక్తి అమ్మ క్యాన్సర్ ప్రత్యేక కేంద్రానికి భూమి పూజ



భూమి పూజలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 4: శ్రీపురం నారాయణి ఆస్పత్రిలో రూ.40 కోట్లతో క్యాన్సర్ ప్రత్యేక కేంద్రం నిర్మాణానికి గురువారం భూమి పూజ జరిగింది. ఆస్పత్రి డైరెక్టర్ డా.బాలాజి, కెనడా దేశానికి చెందిన శక్తి అమ్మ భక్తుడు రామ్‌శంకర్‌వర్మ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలాజి మాట్లాడుతూ.. మారుతున్న వైద్య ప్రపంచంలో కొత్త పరికరాలు, వైద్య పద్ధతులు పరిచయం చేస్తూ కొన్ని వ్యాధుల గురించి ప్రజలకు ఇంకా భయాందోళనలు తొలగలేదన్నారు. వాటిలో క్యాన్సర్ ఒకటన్నారు. గ్రామాల్లో క్యాన్సర్ బాధితులకు చికిత్స తీసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని, బాధితులకు ప్రభుత్వం చికిత్సా విధానాలు అందిస్తున్నా, వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. క్యాన్సర్‌కు గురైన పేదలకు మెరుగైన చికిత్స అందించేలా శ్రీ శక్తి అమ్మ క్యాన్సర్ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అన్నిరకాల చికిత్సలు పేదలకు ఉచితంగా అందించడంలో తమ ఆసుపత్రి పేరుగాంచిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డివైన్‌కేప్, సుఖి ఫార్మశీ జాయింట్ డైరెక్టర్లు శ్రీనాథ్, శ్రీకాంత్, వైద్య నిపుణులు, ఆసుపత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

పక్షుల దాహార్తి తీరుస్తున్న దినేష్



పక్షుల కోసం నీరు పెడుతున్న దినేష్

వేలూరు, ఏప్రిల్ 4: వేసవి కాలంలో పక్షుల దాహార్తిని తీర్చేలా సమాజ సేవకుడు దినేష్ శరవణన్ చర్యలు చేపట్టారు. రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి దినేష్ శరవణన్ తన సొంత ఖర్చుతో పాఠశాలల్లో మొక్కలు నాటడం సహా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుంటారు. ఈ నేపథ్యంలో, వేసవి ఎండలు అధికంగా కావడంతో పక్షులకు తాగునీరు అందించేలా చిన్న చిన్న మట్టి గిన్నెలు ఏర్పాటుచేసి, ప్రతిరోజు నీరు పోస్తున్నట్లు దినేష్ శరవణన్ తెలిపారు.

కేసుల డిజిటలైజేషన్‌కు వ్యతిరేకంగా న్యాయవాదుల రాస్తారోకో

ప్యారీస్, ఏప్రిల్ 4: కేసుల డిజిటలైజేషన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక తిరువొత్తియూర్‌లో న్యాయవాదులు గురువారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. తిరువొత్తియూర్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదుల సంఘ అధ్యక్షులు సుబ్రమణి నేతృత్వంలో పలు డిమాండ్లు పరిష్కరించాలంటూ నిర్వహించిన రాస్తారోకోలో సుమారు 50 మందికి పైగా న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణి మాట్లాడుతూ... న్యాయస్థానాల్లో న్యాయవాదులు నమోదుచేసే కేసులను ఈ నెల 1వ తేది నుంచి కంప్యూటర్‌లో నమోదుచేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయని, సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో డిజిటలైజేషన్ విధానంపై తమకు ఎలాంటి భిన్నాభిప్రాయం లేదని, అయితే న్యాయవాదులు అందరి వద్ద కంప్యూటర్ సదుపాయం లేదన్నారు. అందువల్ల గతం లాగే కోర్టులకు న్యాయవాదులు నేరుగా వెళ్లి విచారణకు సంబంధించిన కేసులను నమోదుచేసే పద్ధతి అనుమతించాలని, అలాగే తిరువొత్తియూర్ మేజిస్ట్రేట్ మున్సిఫ్ కోర్టు, సబ్ కోర్టులకు శాశ్వత న్యాయమూర్తులను నియమించి, పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరింపజేయాలని ఆయన కోరారు.

అతి వేగానికి ఇద్దరు యువకుల బలి

ప్యారీస్, ఏప్రిల్ 4: స్థానిక ప్యారీస్ రిజర్వ్ బ్యాంక్ సొరంగ మార్గంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృత్యువాతపడగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. కొరుక్కుపేట కామరాజ్‌నగర్‌కు చెందిన అభిషేక్ (18), వివేక్ (19) అనే యువకులు వీరి మిత్రుడికి బుధవారం పుట్టినరోజు కావడంతో మెరీనా బీచ్‌లో బర్త్ డే పార్టీ జరపాలని నిర్ణయించారు. రాత్రి 8 గంటలకు బర్త్ డే వేడుకల్లో పాల్గొని 10 గంటల తరవాత బైక్‌ల్లో ఇంటికి బయల్దేరారు. రాత్రి 10.30 గంటల సమయంలో మెరీనా బీచ్ నుంచి ప్యారీస్‌కు వెళ్లే మార్గంలో అభిషేక్, వివేక్‌లు తమ మోటార్‌సైకిల్‌ను వేగంగా నడిపినట్లు తెలిసింది. ఆ సమయంలో ఎర్నావూర్ రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన రమేష్ (24) అనే యువకుడు కూడా వీరితో పోటీపడుతూ తన బైక్‌ను వేగంగా నడిపినట్లు తెలిసింది. వీరు రిజర్వ్ బ్యాంక్ సొరంగ మార్గంలో వేగంగా వెళ్తూ ఊహించని విధంగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. హెల్మెట్ ధరించని కారణంగా అభిషేక్, వివేక్ తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. రమేష్ తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న ట్రాఫిక్ విభాగం పోలీసులు మృతదేహాలను ప్రభుత్వ స్టాన్లీ ఆసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బాలికతో వ్యభిచారం... మహిళ అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 4: స్థానిక నంగనల్లూర్‌లో బాలికతో వ్యభిచారం చేయిస్తున్న మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. తిల్లైగంగానగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతుందనే సమాచారంతో బుధవారం రాత్రి పోలీసులు దాడిచేశారు. అక్కడ 17 ఏళ్ల బాలికతో వ్యభిచారం చేయిస్తున్న 56 ఏళ్ల మహిళను అరెస్ట్ చేసి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, బాలికను ప్రభుత్వ హోంకు తరలించారు.

పాండి ఐస్ పేరుతో మద్యం సరఫరా

● ఒకరి అరెస్ట్

ఐసిఎఫ్, ఏప్రిల్ 4: పాండి ఐస్ పేరుతో మద్యం సరఫరా చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రూ.5 లక్షల విలువైన సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నాగపట్టణంలోని ఓ ఇంట్లో సారా ప్యాకెట్లు దాచి విక్రయిస్తున్నట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదులందాయి. సమాచారం మేరకు అక్కడకు వెళ్లిన పోలీసులు, ఇంట్లో తనిఖీ చేయగా పాండి ఐస్ పేరుతో ఉన్న సారా ప్యాకెట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని, వాటిని విక్రయిస్తున్న గాంధీ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.

9న వేలూరుకు ప్రధాని మోదీ



ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం

వేలూరు, ఏప్రిల్ 4: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 9వ తేది వేలూరులో జరుగనున్న ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారని వేలూరు లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం తెలిపారు. ఆయన గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పెరుముగై పిళ్లయార్ కుప్పం ఓలైకన్ వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెరుముగ్గై, అలమేలు రంగాపురం, రంగాపురం, వళ్లలార్, సత్తువాచేరి, కాగితపుపట్టరై, లాంగ్ బజార్, వేలప్పాడి తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు.

ధరల పెంపు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పుణ్యమే

● సినీ నటి గౌతమి

ప్యారీస్, ఏప్రిల్ 4: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల చేతగానితనం వల్లే బంగారం లాగే నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని సినీ నటి గౌతమి విమర్శించారు. ఇటీవల అన్నాడీఎంకేలో చేరిన గౌతమి గురువారం ఉదయం దక్షిణ చెన్నై అన్నాడీఎంకే అభ్యర్థి జయవర్ధన్ మద్దతుగా రాజా అన్నామలైపురంలో జరిగిన ప్రచారంలో పాల్గొన్నారు. పెట్రోల్-డీజిల్, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు పెరగడానికి కారణం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలేనని గౌతమి వ్యాఖ్యానించారు.

8 నుంచి చెన్నై, కాంచీపురంలో తపాలా ఓట్లు

ఐసిఎఫ్, ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని చెన్నై, కాంచీపురం జిల్లాల్లో తపాలా ఓట్ల నమోదు సోమవారం ప్రారంభం కానుంది. రాష్ట్రంలో దివ్యాంగులు, 85 ఏళ్లకు పైబడిన వృద్ధులకు తపాలా ఓటు హక్కు కల్పించారు. వారిళ్లకే వెళ్లి 12డి ఫారాన్ని అందజేస్తున్నారు. చెన్నైలో ఉన్న 39,01,167 మంది ఓటర్లలో 11,369 మంది దివ్యాంగులు, 63,751 మంది 85 ఏళ్లకు పైబడిన వారు మొత్తం 75,120 మంది ఉన్నారు. వారిలో ఎక్కువ మంది పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేస్తామని చెప్పారు. 4,176 మంది తపాలా ఓటు వినియోగించుకొనేందుకు సుముఖత తెలిపారు. దివ్యాంగుల్లో 366 మంది తమ ఇష్టాన్ని తెలియజేశారు. కాంచీపురం జిల్లా లో 1,039 మంది సీనియర్ సిటిజన్లు, 612 మంది దివ్యాంగులు చొప్పున మొత్తం 1,651 మంది తపాలా ఓటు వినియోగించుకోనున్నారు. వారిళ్లకు వెళ్లి ఓటు సేకరించేందుకు కాంచీపురం జిల్లాలో మొత్తం 14 మొబైల్ బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో పోలింగ్ బూత్ ప్రధానాధికారి, సహాయ అధికారి, సూక్ష్మ పరిశీలకులు ఒకరు, ఒక కానిస్టేబుల్, ఒక ఫొటోగ్రాఫర్ ఉంటారు.

63,482 గోడ ప్రచారాల తొలగింపు

ఐసిఎఫ్, ఏప్రిల్ 4: అనుమతి లేకుండా గోడలపై రాసిన 63,482 ప్రకటనలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. చెన్నై జిల్లా పరిధిలోని లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. గత 18 రోజుల్లో 63,482 గోడ ప్రకటనలు, 14,237 పోస్టర్లు, 608 జెండాలు, 2,050 ఇతర ప్రకటనలు మొత్తం 80,377 ప్రకటనలు తొలగించారు. అలాగే, ప్రైవేటు స్థలాల్లో ఉన్న 5,643 గోడ ప్రకటనలు, 7,974 పోస్టర్లు, 612 జెండాలు, 1,160 ఇతర ప్రకటనలు తొలగించినట్లు అధికారులు తెలిపారు.

సి-విజిల్ యాప్ ద్వారా 2,000 ఫిర్యాదులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 4: రాష్ట్రవ్యాప్తంగా సి-విజిల్ యాప్ ద్వారా 2 వేల ఫిర్యాదులు స్వీకరించినట్లు ప్రధాన ఎన్నికల అధికారి సత్యప్రదసాహు తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదులకు ఈ యాప్‌ను భారత ఎన్నికల కమిషన్ పరిచయం చేసింది. ఇప్పటివరకు 2,193 ఫిర్యాదులు రాగా, వాటిలో 1,694 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. జిల్లాస్థాయిలో గరిష్ఠంగా కరూర్ నుంచి 408, చెన్నై నుంచి 239, చెంగల్పట్టు నుంచి 61, కాంచీపురం నుంచి 92, తిరువళ్లూర్ నుంచి 71 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు.

కన్నియాకుమారి జిల్లాలో ముమ్మరంగా వాహనతనిఖీలు

● ఇప్పటివరకు రూ.1.18 కోట్లు నగదు స్వాధీనం

ప్యారీస్, ఏప్రిల్ 4: కన్నియాకుమారి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుకు రావడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనతనిఖీలు ముమ్మరం చేశారు. కన్నియాకుమారి లోక్‌సభ నియోజకవర్గం, విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలు ఈ నెల 19న జరుగనున్న విషయం తెలిసిందే. జిల్లాలో బుధవారం వరకు రూ.1,18,30,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



వేలూరు లోక్‌సభ నియోకవర్గం ఎన్నికల్లో 100 శాతం ఓటింగ్ నమోదు అవగాహన ప్రచారంలో భాగంగా ఏలగిరి ఆడిటోరియంలో ప్రజలు, హిజ్రాలచే ఓటు హక్కు వినియోగించుంటామంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి



వేలూరు కార్పొరేషన్ తరఫున పాత బస్టాండ్‌లో ఏర్పాటైన ఓటు నమోదు అవగాహన సెల్ఫీ పాయింట్ ప్రారంభిస్తున్న ఉప కమిషనర్ శశికళ



వేలూరు లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి పశుపతికి మద్దతుగా గుడియాత్తంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్



పుదుచ్చేరిలో ఏర్పాటుచేసిన 'మై వాయిస్... మై వోట్' సెల్ఫీ పాయింట్ వద్ద యువ ఓటరు



కోయంబత్తూర్‌లో పోలీసుల మార్చ్ ఫాస్ట్



తాటికల్లు మజా!

కోయంబత్తూర్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అన్నామలైకు మద్దతుగా చేపట్టిన ప్రచారంలో పాల్గొని తాటి కల్లు స్వీకరిస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్

● వీఐపీ నియోజకవర్గం

కాంగ్రెస్ కోట కడలూరులో గెలిచేదెవరు...?





డా.విష్ణుప్రసాద్ (కాంగ్రెస్) - తంగర్‌బచ్చన్ (పీఎంకే) - శివకొళుందు (డీఎండీకే)



ప్యారీస్, ఏప్రిల్ 4: బంగాళాఖాతం తీరంలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు అధికంగా ఉన్న కడలూరు లోక్‌సభ నియోజకవర్గానికి 17 సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధిక విజయాలు సాధించడం ద్వారా కాంగ్రెస్ కోటగా మారింది. ఈ సారి ఎన్నికల్లో కూడా ఈ స్థానాన్ని దక్కించుకొనేందుకు అధికార డీఎంకే కూటమి తరపున పోటీచేస్తున్న కాంగ్రెస్ తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. వాణిజ్యం కోసం భారతదేశంలో కాలుమోపిన ఆంగ్లేయులు దక్షిణ భారతదేశంలో తమ వ్యాపారాన్ని కొనసాగించేందుకు బంగాళాఖాతం తీరంలో ఉన్న కడలూరును కేంద్రంగా ఎంపిక చేసుకున్నారు. నౌకల ద్వారా వాణిజ్యపరమైన వ్యాపారం చేస్తూ భారతదేశాన్ని పరిపాలించగలిగే స్థాయికి ఆంగ్లేయులు ఎదిగారు. అంతేగాకుండా కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో అతి పెద్దదిగా భావిస్తున్న నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్సీ), మామిడి, పనస పండ్ల దిగుబడిలో పేరొందిన బన్రూటి నగరం కడలూరు నియోజకవర్గ పరిధిలో ఉండడం విశేషం.

నియోజకవర్గ పునర్విభజన... : 1951వ సంవత్సరం ఆవిర్భవించిన కడలూరు లోక్‌సభ స్థానంలో కడలూరు, నెల్లికుప్పం, బన్రూటి, ఉళుందూర్‌పేట, రిషివందనం, శంకరాపురం అనే అసెంబ్లీ నియోజకవర్గాలుండేవి. 2008లో నియోజకవర్గాల పునర్విభజనతో ఉళుందూర్‌పేట విల్లుపురం లోక్‌సభ స్థానానికి, రిషివందనం, శంకరాపురం అసెంబ్లీ నియోజకవర్గాలు కళ్లకుర్చి లోక్‌సభ స్థానానికి బదిలీ అయ్యాయి. ప్రస్తుతం కడలూరు, బన్రూటి, నైవేలీ, కురింజిపాడి, విరుదాచలం, దిట్టకుడి (రి) అనే 6 అసెంబ్లీ స్థానాలతో కడలూరు లోక్‌సభ నియోకవర్గం 18వ సారి సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొంటోంది.

డీఎంకే గెలుపు... : కాంగ్రెస్ కోటగా పేరొందిన ఈ స్థానంలో 7 సార్లు కాంగ్రెస్, డీఎంకే 5 సార్లు విజయం సాధించగా, అన్నాడీఎంకే రెండు సార్లు, తమిళ మానిల కాంగ్రెస్, ఉళవర్ ఉళైప్పాలీ పార్టీ, ఓ ఇండిపెండెంట్ తలా ఒకసారి గెలిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే తరపున పోటీచేసిన రమేష్ విజయం సాధించి తొలిసారి పార్లమెంటులో అడుగుపెట్టారు. ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్న 6 అసెంబ్లీ స్థానాల్లో 4 నియోజకవర్గాలు డీఎంకే చేతిలో, మిగతా రెండు కూటమి పార్టీ అయిన కాంగ్రెస్ చేతిలో ఉన్నాయి.

ఓటర్లు... : గత జనవరిలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం కడలూరు లోక్‌సభ స్థానంలో మొత్తం ఓటర్లు 14,01,392 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 6,88,269, మహిళలు 7,12,909, ఇతరులు 214 మంది ఉన్నారు.

2019 ఎన్నికల ఫలితాలు... : ఈ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన డీఎంకే అభ్యర్థి రమేష్ 5,22,160 ఓట్లు సాధించారు. అన్నాడీఎంకే కూటమి తరపున పోటీచేసిన పీఎంకే అభ్యర్థి గోవిందస్వామి 3,78,177 ఓట్లు పొంది ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇక్కడ వన్నియర్ అనే క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వారు 34 శాతం, ఇస్లామీయులు 4 శాతం, నాయుడు వర్గం 3.25 శాతం, ముదలియార్లు 2.80 శాతం, యాదవులు 2.70 శాతం, క్రైస్తవులు 1.70 శాతం, ఇతర వర్గాలు 14.75 శాతం మంది ఉన్నారు.

సమస్యలు... : హార్బర్ ద్వారా ఆంగ్లేయుల హయాంలో వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన కడలూరు ప్రస్తుతం వెనుకబడిన ప్రాంతంగా మారింది. హార్బర్ అందుబాటులో ఉన్నప్పటికీ ఎగుమతి, దిగుమతులు పడిపోవడంతో వాణిజ్యపరంగా కుదేలైంది. ఇక దక్షిణ రైల్వే ప్రధాన రైలు మార్గం కడలూరు మీదుగా వెళ్తున్నప్పటికీ కొత్త రైళ్ల నడపడం లేదు. ముఖ్యంగా కడలూరు-పుదుచ్చేరి-చెన్నై రైలు మార్గంలో చేపట్టిన పనులు మందకొడిగా సాగుతున్నాయి. అంతేకాదు కడలూరు పేరుతో రైల్వేస్టేషన్ నిర్మించకపోవడం అతిపెద్ద కొరతగా ఉంది. నైవేలీ పట్టణంలో మినీ విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్నది స్థానికుల దీర్ఘకాల కోరిక. అన్నదాతలు, మత్స్యకారులు ప్రధాన కోరికలు తీర్చలేదని, అతిపెద్దదైన వెలింగ్టన్ చెరువులో నీరు చేరేందుకు వసతి లేనందువల్ల కావేరి-వెల్లారు నదుల అనుసంధాన పథకం అమలుపరచి నీటివనరులను మెరుగుపరచాలన్నది స్థానికుల డిమాండ్. సముద్ర, నేలబొగ్గు, వ్యవసాయ వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని అభివృద్ధి పరచయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి అని కడలూరు జిల్లా వాసులు ఏకరువు పెడుతున్నారు.

విజయం ఎవరిది...?

గత 2019 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థిగా పోటీచేసిన గెలిచిన రమేష్‌కు ఈ సారి సీటు కేటాయించకుండా, మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు కేటాయించింది. ప్రస్తుతం ఆరణి ఎంపీగా ఉన్న డా.విష్ణుప్రసాద్ ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున పోటీలో ఉన్నారు. అదే విధంగా అన్నాడీఎంకే కూటమి తరపున డీఎండీకే అభ్యర్థిగా శివకొళుందు పోటీచేస్తున్నారు. ఆయన 2011 వరకు బన్రూటి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఇక బీజేపీ కూటమి నుంచి పీఎంకే అభ్యర్థిగా సినీ దర్శకుడు, కెమెరామెన్ తంగర్‌బచ్చన్ మొదటి సారి పోటీచేస్తున్నారు. ఈ ఎన్నికల్లో 41,673 మంది ఓటర్లు తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీల అగ్రనేతలు ప్రచారం చేస్తున్నారు. అయినా విజయం వరించేది ఎవరినో అని కడలూరు జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఇది మరో స్వాతంత్ర్య సంగ్రామం!

● అవునా?!

● మదురైలో కనిమొళి

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ పాలకులు తెల్లదొరల్లాగా విభజించు పాలించు అనే విధానాన్ని అమలు చేసి దేశాన్ని ముక్కలు చెక్కలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రస్తుతం జరుగుతున్నవి లోక్‌సభ ఎన్నికలు కావని మరో స్వాతంత్ర్య సంగ్రామమని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. మదురైలో సీపీఎం అభ్యర్థి వెంకటేశన్‌కు మద్దతుగా ఆమె ప్రచారం చేశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదేళ్లగా తమిళ ప్రజల బాగోగులు ఏమాత్రం పట్టించుకోకుండా రాష్ట్రానికి అవసరమైన నిధులు విడుదల చేయకుండా బీజేపీ ప్రభుత్వం నిరంకుశత్వాన్ని చాటిచెప్పుకుందని విమర్శించారు. మదురైకి అంతర్జాతీయ విమానాశ్రయం కావాలని అడిగితే ససేమిరా కుదరదని చెబుతున్న మోదీ ఎవరూ అడగకనే అయోధ్యలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేశారన్నారు. పదేళ్లగా కార్పొరేట్ సంస్థలకు అండగా ఉంటూ రూ.65వేల కోట్ల మేరకు రుణాలను మాఫీ చేశారని పేర్కొన్నారు.



మదురైలో ప్రచారం చేస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

అడవులను నాశనం చేస్తే నరికిపోగులు పెడతా

● మన్సూర్ అలీఖాన్



వేలూరులో ప్రచారం చేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి మన్సూర్ అలీఖాన్

● ఖాన్ గారి హెచ్చరిక

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేలూరులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ ప్రచారంలోనూ విలన్‌లా డైలాగులు చెబుతూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. పనసపండు గుర్తుపై పోటీ చేస్తున్న ఆయన ఓపెన్‌టాప్ వ్యాన్‌పై కొబ్బరి ఆకులతో పైకప్పు ఏర్పాటు చేసుకుని వీధుల్లో ప్రచారం చేస్తున్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఓటేసి గెలిపిస్తే ఐదేళ్లపాటు నియోజకవర్గంలోనే ఉంటానని, ప్రజలన సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. అంతటితో ఆగకుండా అడవులు, కొండలను నాశనం చేసేవారని నరికిపోగులు పెడతానని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పేదలకు అండగా నిలుస్తా

● సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి మనోజ్ పి.సెల్వం

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపిస్తే కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల పేదలకు అండగా వుంటానని సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి మనోజ్ పి.సెల్వం పేర్కొన్నారు. గురువారం ఆయన టీవీ నగర్, కామరాజర్ వీధి, తిరువళ్లువర్‌వీధి, అన్నావీధి, తందైపెరియార్ వీధి, కోవిల్‌వీధి, తిరువిక వీధి, అంబేద్కర్ వీధి, వావూసీ వీధి, మంగళం కాలనీ, ఎన్‌వీఎన్ నగర్, తిరుమంగళం మెయిన్‌రోడ్డు, నెహ్రూ నగర్, ఓల్డ్ తిరుమంగళం బ్లాక్, 12వ మెయిన్‌రోడ్డు, హెచ్ బ్లాక్ 15వ మెయిన్‌రోడ్డు, రెవెన్యూ క్వార్టర్స్, కదిరవన్ కాలనీ, తంగం కాలనీ, పొన్ని కాలనీ, వసంతం కాలనీ, ఐబ్లాక్, ముత్తుమారియమ్మన్ వీధి, తెండ్రల్ కాలనీ, నావలర్ నగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్గమధ్యలో వున్న మసీదులు, చర్చిలు, ఆలయాలకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక నేతలను, ప్రముఖులతో భేటీ అయ్యారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోజ్ మాట్లాడుతూ... ఎన్నికల్లో తనకు విజయం చేకూర్చిపెడితే పార్టీ పరంగా, కేంద్రప్రభుత్వం సాయంతో, వ్యక్తిగతంగానూ అందరికీ అండగా వుంటానని హామీనిచ్చారు. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం దేశాన్ని ప్రపంచంలోనే అభివృద్ధిపథంలో నడిపేందుకు అహరహం కృషి చేస్తోందని, తానూ ఆ బాటలో నడుస్తానని ఈ సందర్భంగా మనోజ్ పేర్కొన్నారు.



మనోజ్‌తో ముస్లిం చిన్నారులు

రాష్ట్రపతిని నిలబెట్టి అవమానిస్తారా?

● మోదీని ప్రశ్నించిన సినీ నటి రోహిణి

● ఆడాళ్లంటే అలుసా?!



దిండుగల్‌లో ప్రచారం చేస్తున్న రోహిణి

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొత్త పార్లమెంట్ భవనసముదాయం ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడంతోపాటు బీజేపీ సీనియర్ నేత అద్వాణీకి భారతరత్న ప్రదానం చేసేటప్పుడు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నిలబెట్టి అగౌరవపరిచారని, మహిళాభ్యుదయమే తమ ధ్యేయం అంటూ చెప్పుకునే ప్రధాని మోదీ అమలు చేస్తున్న సామాజిక న్యాయం ఇదేనా? అని నటి రోహిణి ప్రశ్నించారు. ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతుగా కొడైకెనాల్‌లో ఆమె ప్రచారం చేశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాల వల్ల మహిళల అక్షరాస్యత రోజురోజుకూ పెరుగుతోందని, అయితే ప్రధాని మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో మహిళల అక్షరాస్యత 27 శాతానికి పరిమితమైపోయిందన్నారు. బీజేపీ సీనియర్ నేత అద్వాణీకి భారత రత్న పురస్కారం అందజేస్తున్నప్పుడు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిలబడి ఉంటే ప్రధాని మోదీ దర్జాగా కుర్చీలో కూర్చున్న దృశ్యాలు పరిశీలిస్తే బలహీన వర్గాలకు చెందిన మహిళల పట్ల ఆయనకున్న గౌరవం ఏపాటిదో అవగతమవుతుందని రోహిణి పేర్కొన్నారు.

● మరో సత్యం

బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేస్తామని బెదిరించారు!

● బీజేపీ నేతలపై ప్రేమలత ఆగ్రహం

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయేలో చేరకపోతే కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేసినట్లే తమ బ్యాంక్ ఖాతాలు కూడా స్తంభింపజేస్తామంటూ బీజేపీ నేతలను తనను బెదిరించారని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆరోపించారు. ఆ బెదిరింపులను పట్టించుకోకుండా మాజీ ముఖ్యమంత్రి జయలలితలాగా తాను సాహసించి ధైర్యంగా అన్నాడీఎంకే కూటమిలో చేరానని ఆమె పేర్కొన్నారు. కాంచీపురం నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా ఆమె ప్రసంగించారు. డీఎంకే అసమర్థ పాలనపై విసిగిపోయిన ప్రజలు ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకేని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, డీఎంకే కూటములకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.



కాంచీపురంలో ప్రచారం చేస్తున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

● అత్తమీద కోపం దుత్తమీద అన్నట్లుగా !

ఎన్నికల సంఘం కాదది డ్రామా కంపెనీ!

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఓ పెద్ద డ్రామా కంపెనీలా పనిచేస్తోందని నామ్ తమిళర్ కట్చి నాయకుడు సీమాన్ ఆరోపించారు. సెంట్రల్ చెన్నై నియోజకవర్గంలో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థి ఇరా కార్తికేయన్‌కు మద్దతుగా చింతాద్రిపేట వద్ద ఆయన ప్రచారం చేశారు. ఆ సందర్భంగా సీమాన్ మాట్లాడుతూ ఈవీఎంలను సులువుగా హ్యాక్ చేయవచ్చునని విదేశాలకు చెందిన సాంకేతిక నిపుణులు చెబుతున్నారని, ప్రజలు ఎవరికి ఓటేశారో నిర్ధారించే వీవీ పాడ్‌లలో నమోదయ్యే ఓట్లను లెక్కించేందుకు ఎన్నికల సంఘం అంగీకరించకపోవడం గర్హనీయమన్నారు. సాంకేతిక పరిజ్ఞానంలో ప్రథమ స్థానంలో ఉన్న జపాన్ లోనూ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరుగుతుంటే భారతదేశంలో ఈవీఎంలతో ఎన్నికలు జరుపటం భావ్యం కాదన్నారు. వ్యాపారులు, సామాన్యులు డబ్బులు తీసుకెళ్తుంటే అదే పనిగా పట్టుకునే ఎన్నికల సంఘం అధికారులు ప్రధాన పార్టీలు ఓటర్లకు ఓటు ఇంత అంటూ నోట్లు పంచుతున్నా పట్టించుకోవడమే లేదన్నారు. ఏది ఏమైనప్పటికీ ఎన్నికల సంఘం న్యాయబద్ధంగా ఎన్నికలు జరిపించే సంస్థలా వ్యవహరించడం లేదని డ్రామాల కంపెనీ లాగే పనిచేస్తోందని సీమాన్ విమర్శించారు.



సీమాన్

● ఇదేందబ్బా!

నోటాకు మద్దతుగా రైతుల ప్రచారం



ఐసిఎఫ్, ఏప్రిల్ 4: మేట్టుపాళయంలో నోటాకు మద్దుతుగా రైతులు ప్రచారం చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే రాజకీయపార్టీ అభ్యర్థులకు మద్దతుగా వివిధ సాంఘీక సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. అయితే నీలగిరి నియోజకవర్గ పరిధిలోని మేట్టుపాళయం ప్రాంతంలో రాష్ట్ర రైతుల సంఘం నోటాకు మద్దతుగా ప్రచారం చేపట్టింది. ఈ విషయమై సంఘ నిర్వాహకులు మాట్లాడుతూ... మేట్టుపాళయం, చుట్టుపక్కల ప్రాంతాల్లో అడవి జంతువులు గ్రామాల్లో ప్రవేశించి పంట పొలాలను ధ్వంసం చేయడం, మనుషులపై దాడులకు పాల్పడడం జరుగుతోందని, బాధితులు ఎన్ని సార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. రాజకీయపార్టీలను బహిష్కరించేలా ఈ ఎన్నికల్లో నోటాకు మద్దతుగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు.

ఎన్నికల అవగాహన వీడియో.. విడుదల చేసిన విజయ్‌సేతుపతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ జరగాలని ఆకాంక్షిస్తూ 'ఇచ్చితంగా ఓటు వేయండి' పేరుతో ఎన్నికల అవగాహన వీడియోను నటుడు విజయ్‌సేతుపతి విడుదల చేశారు. ఈ వీడియోలో 'మనమందరం ఎదురుచూస్తున్న ఎన్నికలు వచ్చేశాయి. సాధారణంగా ఎన్నికల సమయంలో అందరికీ ఏకాభిప్రాయం ఉంటుంటుంది. ఎవరు గెలిస్తే మనకేమిటి? లేక ఎవరు డబ్బిస్తారో వారికి ఓటు వేద్దాం. ఓటు వేసినా ఒరిగేదేమీ లేదు వంటి ఆలోచనలు పక్కన పెట్టి మనం మన కోసం కాకపోయినప్పటికీ, పిల్లల భవిష్యత్తు కోసం భావితరాల కోసం తప్పనిసరిగా ఓటు వేద్దాం' అనే సందేశమిచ్చారు.



'విడాముయర్చి' కోసం అజిత్ రిస్కీ స్టంట్!!

● మేకింగ్ వీడియో రిలీజ్

చిత్రజ్యోతి

మగిళ్ తిరుమేని దర్శకత్వంలో అజిత్ హీరోగా 'విడాముయర్చి' చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతుంది. ఈ సినిమా కోసం అజిత్ ప్రాణాలకు తెగించి ఒక రిస్కీ స్టంట్ చేశారు. దీనికి సంబంధించిన మేకింగ్ వీడియోను అజిత్ కుమార్ వ్యక్తిగత మేనేజర్ సురేష్ చంద్ర గురువారం ట్విట్టర్ ఖాతాలో రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో అజిత్ కారు డ్రైవింగ్ చేస్తుండగా, ఆయన పక్క సీటులో నటుడు ఆరవ్ గాయాలతో కట్టేసివుండగా, ఓ ఇంటెన్స్ సీక్వెన్స్ షూట్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ కారు రోడ్డుపై నుంచి అదుపుతప్పి బోల్తా పడుతుంది. ఆ వెంటనే యూనిట్ సభ్యులు పరుగెత్తుకుంటూ వచ్చి కారులోని అజిత్, ఆరవ్‌లను బయటకు తీసే ప్రయత్నం చేశారు. ఈ స్టంట్‌ను అజిత్, ఆరవ్ ఎలాంటి డూప్ లేకుండా చేశారు. ఇది గత యేడాది నవంబరులో చిత్రీకరించిన యాక్షన్ సీక్వెన్స్ సన్నివేశం. కాగా, గతంలో తాను నటించిన పలు చిత్రాల్లో కార్, బైక్ రేసింగ్ స్టంట్ సన్నివేశాల్లో అనేక రిస్కీ షాట్‌లను కూడా అజిత్ ఎలాంటి డూప్ లేకుండా నటించిన విషయం తెల్సిందే. ఇపుడు 'విడాముయర్చి' కోసం మరోమారు రిస్కీ స్టంట్ చేయడంతో ఆయన అభిమానులు ఆందోళనకు చెందుతూ ఇలాంటి రిస్కీ షాట్‌లకు దూరంగా ఉండగాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, అజర్‌బైజాన్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రంలో త్రిష, అర్జున్ నటిస్తున్నారు.



అజిత్ కుమార్ - ఆరవ్

అరుణ్ విజయ్ సరసన ఇద్దరు హీరోయిన్లు

హీరో అరుణ్ విజయ్ నటించే 36వ చిత్రం పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ఇందులో అరుణ్ విజయ్ సరసన తాన్య రవిచంద్రన్, సిద్ధి ఇద్నానీ హీరోయిన్లుగా నటించనున్నారు. గతంలో 'మాన్ కరాటే', 'కొత్తు' వంటి చిత్రాలను తెరకెక్కించిన డైరెక్టర్ క్రిష్ తిరుకుమరన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గురువారం నగరంలో జరిగిన పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ పాల్గొని తొలి షాట్‌కు క్లాప్ కొట్టి, చిత్ర బృందానికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీటీజీ యూనివర్సల్ పతాకంపై బాబి బాలచంద్రన్ నిర్మించే ఈ చిత్రాన్ని యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రూపొందించనున్నారు. ఇది అరుణ్ విజయ్‌కు 36వ చిత్రం కాగా, బీటీజీ యూనివర్సల్‌కు ఇది మూడో సినిమా. ఇతర పాత్రల్లో హరీష్ పేరడి, యోగేష్ స్వామి, జాన్ విజయ్, బాలాజీ మురుగదాస్, విన్సెంట్ అశోకన్ తదితరులు నటించనున్నారు. డిజో టామీ ఛాయాగ్రహణం అందించే ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. ఇదిలావుంటే, అరుణ్ విజయ్ ప్రస్తుతం బాలా దర్శకత్వంలో 'వణంగాన్' అనే చిత్రంలో నటించగా, ఇది విడుదలకు సిద్ధంగా ఉంది.



నూతన చిత్రం పూజా కార్యక్రమం